క్లుప్తంగా

మాస శివరాత్రి ప్రత్యేక పూజలు


శివాలయంలో పూజలు చేస్తున్న భక్తులు

సుల్తానాబాద్: పట్టణంలోని శివాలయంలో మాసశివరాత్రి సందర్భంగా భక్తులు ప్రత్యేక పూజలుచేశారు. శుక్రవారం స్వామివారికి రుద్రాభిషేకం నిర్వహించారు. అనంతరం అర్చకులు ప్రత్యేక పూజలు చేసి భక్తులకు తీర్థ ప్రసాదాలు అందించారు.ఆలయకమిటీ చైర్మన్ సత్యనారాయణ, కొమురవెల్లి సాయిరాం, జ్యోతి, రమేశ్, మాధవి ఉన్నారు.

డీటీఎఫ్ క్యాలెండర్ ఆవిష్కరణ


క్యాలెండర్ ఆవిష్కరిస్తున్న ఉపాధ్యాయులు

ముత్తారం: మండలకేంద్రంలోని జెడ్పీపాఠశాలలో డీటీఎఫ్ మండల అధ్యక్షుడు గసిగంటి దేవేందర్ డీటీఎఫ్ క్యాలెండర్ ఆవిష్కరించారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వం ఉపాధ్యాయుల బదిలీలు, ప్రమోషన్లు పారదర్శకంగా చేపట్టాలన్నారు. 317 జీవోతో వచ్చిన వారికి కూడా అవకాశం కల్పించాలన్నారు. కేజీబీవీ, మోడల్‌స్కూల్ ఉపాధ్యాయులకు సైతం బదిలీలు చేపట్టాలని ఉద్యోగులకు రావాల్సిన డీఏలను ప్రకటించాలని డిమాండ్‌చేశారు. హైమావతి దాస్, ప్రసుమతి, రత్నాకర్ రెడ్డి, రవినాయక్, రాజ్‌కుమార్ ఉన్నారు.

విద్యార్థులకు షూ అందజేత


షూ అందిస్తున్న ఎస్సై అశోక్‌రెడ్డి

సుల్తానాబాద్‌రూరల్: మండలంలోని గర్రెపల్లి ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు యూఎస్‌ఏ సాఫ్ట్‌వేర్ ఉద్యోగి మహేష్‌చంద్ర రూ.35వేల విలువైన షూ అందించగా శుక్రవారం ఎస్సై అశోక్‌రెడ్డి పాఠశాలలో విద్యార్థులకు అందించారు. జనవరి 26 సందర్భంగా విద్యార్థులకు క్రీడాపోటీలు ఏర్పాటుచేయగా సర్పంచ్‌ల ఫోరం మండల అధ్యక్షురాలు వీరగోని సుజాత, మాజీ సింగిల్‌విండో చైర్మన్ రమేశ్‌గౌడ్ క్రీడాపోటీలను ప్రారంభించారు. ఈ సందర్భంగా క్రీడల నిర్వహణకు సర్పంచ్ దంపతులు రూ. 10వేలు విరాళం అందించారు. హెచ్‌ఎం మాధ విలత, ఎస్‌ఎంసీ చైర్మన్ సంపత్, ఉపాధ్యాయులు, విద్యార్థులున్నారు.

మల్లేపల్లి ఉప సర్పంచ్‌పై చర్యకు ఆదేశాలు

మంథని: మండలంలోని మల్లేపల్లి ఉపసర్పంచ్ బి.రాధమ్మ పంచాయతీ బిల్లుల చెల్లింపునకు సంబంధించిన నోట్ ఫైల్‌పై సంతకం చేయకుండా, పంచాయతీ సమావేశాలకు హాజరుకాకుండా విధుల పట్ల నిర్లక్ష్యం వహించినందుకు కలెక్టర్ ఆమెపై చర్యలకు ఉపక్రమించారు. షోకాజ్ నోటీసు జారీచేసినా తీసుకునేందుకు నిరాకరించి అధికారుల ఆదేశాలను ఉద్దేశ పూర్వకంగా తిరస్కరించినట్లు భావించారు. ఈ మేరకు గ్రామంలో గ్రామసభ ఏర్పాటుచేసి ఆమెస్థానంలో వార్డు సభ్యుల నుంచి ఒక సభ్యుడిని రెండో సంతకందారుగా ఎన్నుకోవాలని సర్పంచ్, పంచాయతీ కార్యదర్శిని ఆదేశిస్తూ కలెక్టర్ జారీచేసిన ఉత్వర్వుల్లో పేర్కొన్నారు.

పారిశుధ్యం నిర్వహణపై దృష్టి సారించాలి

కమాన్‌పూర్: మండల పరిధిలోని గ్రామాల్లో పారిశుధ్యం నిర్వహణపై కార్యదర్శులు దృష్టి సారించాలని డీఎల్‌పీవో రాంబాబు అన్నారు. మండలకేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో శుక్రవారం పంచాయతీ కార్యదర్శులతో సమావేశం నిర్వహించి మాట్లాడారు. గ్రామాల్లో వందశాతం ఇంటిపన్ను వసూలు చేయాలని తాగునీటి సమస్య తలెత్తకుండా చూడాలని సూచించారు. సమావేశంలో ఎంపీడీవో విజయ్‌కుమార్, ఎంపీవో ఆరీఫ్ పాల్గొన్నారు.

ఉపాధ్యాయుడిగా మారిన ప్రత్యేకాధికారి


విద్యార్థుల్ని ప్రశ్నిస్తున్న ప్రత్యేకాధికారి భాస్కర్

సుల్తానాబాద్: పట్టణంలోని ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు పట్టణ ప్రత్యేక అధికారి, జిల్లా మత్స్యశాఖ అధికారి భాస్కర్ ఉపాధ్యాయుడి అవతారమెత్తి పాఠాలు బోధించారు. విద్యార్థుల సందేహాలను నివృత్తిచేశారు.

ఎన్నాళ్లకెన్నాళ్లకు..!

- రూ.16 కోట్లతో మడక టూ గుంపుల రోడ్డు పనులు ప్రారంభం
- సుల్తానాబాద్ నుంచి జమ్మికుంట వెళ్లే ప్రయాణికులకు...
- పెద్దపల్లి, కరీంనగర్, హన్మకొండ జిల్లాలకు ప్రయాణం సులువు
- సింగరేణి కార్మికులకు సులువైన మార్గం
- ఇటీవల పనులు ప్రారంభించిన మంత్రి కొప్పుల, ఎమ్మెల్యే దాసరి


మడక నుంచి పొత్కపల్లి మధ్య ప్రారంభించిన పనులు

ఓదెల: పెద్దపల్లి, కరీంనగర్ జిల్లాల ప్రయాణికులకు వారధిగా మారిన ఓదెల మండలం మడక నుంచి గుంపుల వరకు రోడ్డుపనులు ప్రారంభమయ్యాయి. ఇందుకు రూ.16 కోట్లు నిధులు విడుదల చేసి రోడ్డు పనులను ఇటీవల మంత్రి కొప్పుల ఈశ్వర్, పెద్దపల్లి ఎమ్మెల్యే దాసరి మనోహర్‌రెడ్డి ప్రారంభించారు. మడక నుంచి గుంపుల వరకు 13 కిలోమీటర్ల వరకు రోడ్డుపూర్తిగా గుంతలమయం కాగా ప్రయాణికులు నరకయాతన పడ్డారు. సుల్తానాబాద్ నుంచి వయా మడక, గుంపుల మీదుగా జమ్మికుంట, కరీంనగర్, హన్మకొండకు వెళ్లే ఆర్టీసీ బస్సులన్నీ ఈ మార్గం గుండా వెళ్లేవి. రోడ్డుపై అధిక లోడ్లతో వెళ్తుండడంతో ఇసుకలారీలతో నామరూపాల్లేకుండా పోయింది దుమ్మధూళితో రోడ్డుకు ఇరువైపులా ఉన్న గ్రామస్తులు, ప్రయాణికులు శ్వాసకోశ సంబంధిత వ్యాధులతో అస్వస్థతకు గురయ్యారు. మడక, పొత్కపల్లి, శానగొండ, ఇందుర్తి, గుంపుల వరకు రోడ్డు గుంతలుగా మారడంతో బైకులు పూర్తిగా వెళ్లలేని పరిస్థితి ఏర్పడింది. ఈ దారిగుండా వెళ్లే బస్సులు గమ్యస్థానం చేరేందుకు గంటల తరబడిగా సమయం పట్టేది. దీంతో ప్రయాణికుల సమస్యలు పరిష్కరించేందుకు పెద్దపల్లి ఎమ్మెల్యే దాసరి మనోహర్‌రెడ్డి ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి రూ. 16 కోట్లను రోడ్డు నిర్మాణానికి మంజూరు చేయించారు. ప్రస్తుతం పనులు ప్రారంభించి నాణ్యత లోపం లేకుండా పనులు చకాచకా చేస్తున్నారు. దీంతో ప్రయాణికులు, స్థానిక గ్రామాల ప్రజలు ఆనందం వ్యక్తంచేస్తున్నారు. ఎన్నో ఏళ్లుగా ఎదురుచూస్తున్న రోడ్డు నిర్మాణానికి మోక్షం కలగడంతో రోడ్డు ప్రమాదాలు జరగకుండా ఉంటాయని ప్రయాణికులు పేర్కొంటున్నారు. ఆర్టీసీ బస్సుల్లో పెద్దపల్లి నుంచి జమ్మికుంట, కరీంనగర్, హన్మకొండకు వెళ్లేందుకు ప్రయాణికులు ఆసక్తి చూపుతున్నారు. హన్మకొండ, వరంగల్, కరీంనగర్ జిల్లాల నుంచి మడక, పొత్కపల్లి రోడ్డుగుండా గోదావరిఖని, మంచిర్యాల, మందమర్రి, బెల్లంపల్లిలో పనిచేసే సింగరేణి కార్మికులు ప్రయాణించడానికి ఉత్సాహంగా ఉన్నారు. చాలా రోజులుగా ఇబ్బందులు పడిన ప్రయాణికులు గ్రామస్తులకు రోడ్డుమరమ్మతులు వేగవంతం కావడంతో ఇబ్బందులు తొలగిపోయాయని ఎమ్మెల్యే, మంత్రికి కృతజ్ఞతలు తెలుపుతున్నారు.

తొలగిన ఇబ్బందులు



మడక నుంచి గుంపుల వరకు రోడ్డు పనులు ప్రారంభించడంతో ప్రయాణికుల ఇబ్బందులు తొలిగాయి. గతుకుల రోడ్డుపై నరకయాతన అనుభవించారు. ప్రస్తుతం ప్రయాణికులకు అనుకూలంగా రోడ్డు నిర్మిస్తుండడంతో ఊపిరిపీల్చుకుంటున్నారు. ఈ రోడ్డుగుండా జమ్మికుంట, హన్మకొండకు చేరుతున్నారు. – ఆళ్ల శ్రీనివాస్‌రెడ్డి, సింగిల్‌విండో చైర్మన్, పొత్కపల్లి

అద్దంలా ముస్తాబు



మడక నుంచి గుంపుల వరకు రోడ్డునిర్మాణం పనులు అద్దంలా ముస్తాబవుతున్నాయి. గతంలో రోడ్డుగుంతలుగా మారడంతో గంటల తరబడి ఆలస్యంతో ఆర్టీసీ బస్సులు, ప్రయాణికులు గమ్యం చేరేవారు. ప్రస్తుతం పెద్దపల్లి జిల్లా నుంచి కరీంనగర్, హన్మకొండ జిల్లాలకు సులువుగా ప్రయాణికులు చేరే అవకాశం కలిగింది. – కావటి రాజు, రైతు మండలి చైర్మన్, ఓదెల

ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు



మడక నుంచి గుంపుల వరకు రోడ్డు నిర్మాణానికి నిధులు మంజూరుకు కృషిచేసిన పెద్దపల్లి ఎమ్మెల్యే దాసరి మనోహర్‌రెడ్డికి కృతజ్ఞతలు. ప్రస్తుతం మడక నుంచి రోడ్డు పనులు చకచక సాగుతున్నాయి. రోడ్డునిర్మాణం పనులు వేగవంతం కావడంతో ప్రయాణికుల్లో ఉత్సాహం నెలకొంది. – వంగల శ్రీనివాస్, ఉపసర్పంచు, పొత్కపల్లి

పెద్దపల్లిని స్వచ్ఛతలో ముందుంచుదాం

- ఇతర మండలాలకు ఆదర్శంగా తీర్చిదిద్దాలి
- ఎమ్మెల్యే దాసరి మనోహర్‌రెడ్డి


మండలసభలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే దాసరి మనోహర్‌రెడ్డి

పెద్దపల్లిరూరల్: గ్రామీణ ప్రాంతాలను స్వచ్ఛత, పరిశుభ్రతలో ముందుంచేలా పంచాయతీ పాలకులు కృషిచేయాలని ఎమ్మెల్యే దాసరి మనోహర్ రెడ్డి అన్నారు. శుక్రవారం ఎంపీపీ స్రవంతి అధ్యక్షతన నిర్వహించిన మండల సర్వసభ్య సమావేశంలో జెడ్పీటీసీ బండారి రామ్మూర్తి, సింగిల్‌విండో చైర్మన్ మాదిరెడ్డి నర్సింహరెడ్డి పాల్గొన్నారు. పెద్దపల్లి మండలాన్ని ఇతర మండలాలకు ఆదర్శంగా నిలిపేలా స్థానిక ప్రజాప్రతినిధులు పనిచేయాలని ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి అన్నారు. సీఎం కేసీఆర్ ప్రతి పంచాయతీకి రూ.10లక్షలు నిధులు మంజూరు చేసిన పనులకు తీర్మాణాలు అందించి పనులు ప్రారంభించాలని సూచించారు. ఉపాధిహామీ పథకంలో మంజూరైన పనులను త్వరగా ప్రారంభించాలన్నారు. లేదంటే పనులు రద్దయ్యే అవకాశం ఉందన్నారు. సీసీరోడ్డు పనులు ప్రారంభించి వదిలేస్తే వాటికి ఇరువైపులా మొరం పోయించకపోవడంతో ఇబ్బందులు తలెత్తుతున్నాయనే కారణంతో పనులు చేపడితే బిల్లులు రావంటున్నారని భోజన్నపేట సర్పంచ్ మల్లేశ్‌యాదవ్ సభ దృష్టికితెచ్చారు. నిబంధనల మేరకే పనులు చేయాలని ఎంపీడీవో రాజు పేర్కొన్నారు. పలు ప్రభుత్వ శాఖల అధికారులు తమ శాఖల ఆధ్వర్యంలో నిర్వహించే పనుల వివరాలు వెల్లడించారు. సమావేశంలో తహసీల్దార్ వెంకటలక్ష్మి, ఏవో అలివేణి, ఏపీఎం సంపత్ సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

క్రీడలతో ఐకమత్యం పెంపొందుతుంది

ఎలిగేడు: క్రీడలతో ఐకమత్యం పెంపొందుతుందని పెద్దపల్లి ఎమ్మెల్యే దాసరి మనోహర్‌రెడ్డి అన్నారు. మండలంలోని ర్యాకల్‌దేవ్‌పల్లి, ముప్పిరితోట, రాములపల్లి గ్రామాల్లో కేసీఆర్ క్రికెట్‌కప్ పోటీలను శుక్రవారం ప్రారంభించారు. కార్యక్రమంలో ఎంపీపీ తానిపర్తి స్రవంతి మోహన్‌రావు, బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు బైరెడ్డి రాంరెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ విజయభాస్కర్ రెడ్డి, సర్పంచులు విజేందర్‌రెడ్డి, ఐలయ్య, సౌమ్య, ఎంపీటీసీలు ప్రేమలత కమలాకర్‌రెడ్డి, ఉప సర్పంచు తిరుపతి, లక్ష్మయ్య, కోమల్‌రెడ్డి, నాయకులు రాజకొమురయ్య, అనిల్, వినోద్, సంపత్, శ్రీనివాస్, సాగర్, మధు, సందీప్, క్రీడాకారులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

సీఎంఆర్‌ఎఫ్ చెక్కు అందజేత

సుల్తానాబాద్‌రూరల్: మండలంలోని గొల్లపల్లికి చెందిన యాదయ్యకు సీఎంఆర్‌ఎఫ్ చెక్కును శుక్రవారం ఎమ్మెల్యే దాసరి మనోహర్‌రెడ్డి అందించారు. ఎంపీటీసీ గట్టు శ్రీనివాస్ తదితరులున్నారు.

షెడ్డు ఇలా... యోగా చేసేదెలా..

- అసంపూర్తిగా భవనం నిర్మాణ పనులు..
- పట్టించుకోని అధికారులు...


నిలిచిన యోగా షెడ్డు నిర్మాణం


పిచ్చి మొక్కల మధ్య షెడ్డు

ముత్తారం: సూదిమందుతో నయం కాని రోగం యోగాతో నయం చేయొచ్చనే నానుడి అందరికీ తెలిసిందే. సాంప్రదాయ వైద్యంలో భాగంగా యునాని చికిత్స ద్వారా రోగులకు వైద్యం అందించడంతో పాటు యోగా సాధన చేయించాలనే ఉద్దేశంతో నిర్మిస్తున్న షెడ్డు నిర్మాణం పనులు మధ్యలోనే నిలిచిపోయాయి. ముత్తారం మండలం అడవిశ్రీరాంపూర్ గ్రామంలో ఏడాది క్రితం చేపట్టిన పనులు అర్ధాంతరంగా నిలిచిపోవడంతో షెడ్డులో పిచ్చిమొక్కలు పెరిగి నిరుపయోగంగా మారింది.

నిధులు మంజూరై ఏడాది పూర్తి...

నేషనల్ ఆయూష్ మిషన్ పథకంలో భాగంగా డివిజన్‌లోని పలు మండలాల్లో యోగా సాధనకు కేంద్ర ప్రభుత్వం గతేడాది సుమారు రూ.6 లక్షల నిధులను మంజూరు చేసింది. ఈ నిధులతో కాంట్రాక్టర్ మొదటగా పనులు చకచకా సాగించారు. కాని మూడు నెలల వ్యవధిలోనే పనులు నిలిపివేశారు. ఎలాంటి కారణం లేకుండానే షెడ్డు నిర్మాణం ఎందుకు పూర్తిచేయలేదనేది అర్థం కాని ప్రశ్నగా మిగిలిందని స్థానికులు పేర్కొంటున్నారు.

ఆస్పత్రికి అనుబంధంగా...

అల్లోపతి వైద్యానికి అలవాటు పడిన ప్రజలను సాంప్రదాయ చికిత్సలు హోమియోపతి, యునాని వంటి వాటిని అందించేందుకు వైద్యకేంద్రాలను ఏర్పాటుచేశారు. అలాంటి యునాని వైద్యకేంద్రాన్ని అడవిశ్రీరాంపూర్‌లో కొనసాగిస్తున్నారు. దీనికి అనుబంధంగానే వివిధ వ్యాధులతో వచ్చేవారికి యోగా సాధన కోసం ఈ షెడ్డును నిర్మిస్తున్నారు. ఈ షెడ్డు నిర్మాణం పూర్తయితే మండలంలోని ప్రజలకు ఎంతో సౌకర్యంగా ఉండేదని చికిత్సతోపాటు సాధన చేస్తే రోగాలు త్వరగా నయం అయ్యే అవకాశం కోల్పోవాల్సి వస్తోందని రోగులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు చర్యలు తీసుకుని యోగా షెడ్ నిర్మాణం పూర్తిచేయాలని కోరుతున్నారు.

పిచ్చి మొక్కల మధ్య షెడ్డు...

ప్రజల సౌకర్యార్థం ఏర్పాటుచేయాల్సిన యోగా షెడ్డు పనులు మధ్యలోనే వదిలేయడంతో షెడ్డులో పిచ్చి మొక్కలు పెరిగాయి. షెడ్డు నిర్మాణం చేయాల్సిన కాంట్రాక్టర్ మధ్యలోనే వదిలేసిన కనీసం అధికారులు పట్టించుకోవడం లేదని గ్రామస్తులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి షెడ్డును పూర్తిచేసి అందుబాటులోకి తేవాలని గ్రామస్తులు కోరుతున్నారు.

పట్టించుకోవడం లేదు



యోగా షెడ్డు నిర్మాణం పూర్తిచేయాలని ఎన్నిసార్లు అధికారుల దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోవడం లేదు. పంచాయతీ రాజ్‌శాఖ అధికారుల దృష్టికి తీసుకెళితే గతంలో ఇక్కడ పనిచేసే అధికారులను అడగాలని దాట వేస్తున్నారు. – దొడ్డ గీతారాణి, ఎంపీటీసీ, అడవిశ్రీరాంపూర్

అందుబాటులోకి తేవాలి



యోగా షెడ్డు కోసం ఆయుష్ మిషన్‌ద్వారా నిధులు మంజూరైన కాంట్రాక్టర్ నిర్లక్ష్యంతో పనులు నిలిచిపోయాయి. పనులు పూర్తిచేసి షెడ్డును అందుబాటులోకి తేవాలి. అనారోగ్య సమస్యలతో బాధపడేవారికి, మానసిక ఒత్తిడి నివారణకు యోగా ఉపయోగపడుతుంది. – లక్కం ప్రభాకర్, గ్రామస్తుడు, అడవిశ్రీరాంపూర్

నోటీసులు జారీ చేశాం

యోగా షెడ్డు నిర్మించాలని కాంట్రాక్టర్‌కు నోటీసులు జారీచేశాం. ఉన్నతాధికారుల దృష్టికి సమస్యను తీసుకెళ్లి పరిష్కరించేలా చర్యలు తీసుకుంటాం. త్వరలోనే షెడ్డు నిర్మాణం పూర్తయ్యేలా కాంట్రాక్టర్‌తో చర్చించి సమస్య ఎక్కడ వచ్చిందో వివరాలు సేకరిస్తాం. స్థానికులు, యోగా సాధనకు ఇబ్బందులు లేకుండా చూస్తాం. – రవికుమార్ పంచాయతీ రాజ్ ఏఈ

‘కంటివెలుగు’కు విశేషస్పందన


కంటి వెలుగు శిబిరాన్ని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే

సుల్తానాబాద్‌రూరల్/ఓదెల/ముత్తారం/ఎలిగేడు/జూలపల్లి/కాల్వశ్రీరాంపూర్/కమాన్‌పూర్/యైటింక్లయిన్‌కాలనీ: పెద్దపల్లి, రామగుండం, మంథని నియోజకవర్గాల్లో శుక్రవారం రెండోరోజు చేపట్టిన ‘కంటివెలుగు’ కార్యక్రమానికి స్పందన లభించింది. ఈ సందర్భంగా కంటిపరీక్షలు చేసుకునేందుకు వైద్యశిబిరాలకు హాజరైన వారిని వైద్యులు పరీక్షించి అవసరమైన వారికి మందులు, కళ్లజోళ్లు అందించారు. కంటిచూపు లోపం ఉన్నవారిని శస్త్రచికిత్సకు రేకుర్తి కంటి ఆస్పత్రికి తరలిస్తున్నారు. ఈ సందర్భంగా వైద్యశిబిరాలను అధికారులు, ప్రజాప్రతినిధులు సందర్శించి మౌళిక వసతులపై ఆరాతీస్తున్నారు. రాష్ట్రప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న ‘కంటివెలుగు’ కార్యక్రమాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరుతున్నారు.

ఏసీడీ చార్జీలు రద్దు చేయాలని బీజేపీ ధర్నా


వినతిపత్రం ఇస్తున్న కార్పొరేటర్ కౌశిక లత

రామగుండం: రాష్ట్ర ప్రభుత్వం ఏసీడీ చార్జీలను రద్దుచేయాలని బీజేపీ ఆధ్వర్యంలో రామగుండం ఎన్‌పీడీసీఎల్ కార్యాలయం ఎదుట నాయకులు ధర్నా చేశారు. 22వ డివిజన్ కార్పొరేటర్ కౌశిక లత ఆధ్వర్యంలో స్థానిక అంబేద్కర్‌చౌక్ నుంచి ఎన్‌పీడీసీఎల్ కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించారు. అనంతరం ఏఈ కార్యాలయం ఎదుట ధర్నాచేశారు. కార్పొరేటర్ కౌశిక లత మాట్లాడుతూ... ప్రభుత్వం విద్యుత్‌చార్జీలు పెంచి పేద, మధ్యతరగతి ప్రజలపై భారం మోపిందన్నారు. ప్రస్తుతం కొత్తగా అడిషనల్ కంజంక్షన్ డిపాజిట్ (ఏసీడీ) బిల్లుల పేరుతో మరింత భారం పెంచుతున్నారని ఏసీడీ బిల్లుల చార్జీ రద్దు చేయకుంటే ప్రజలను చైతన్యపరిచి ఆందోళనలు చేపడుతామని హెచ్చరించారు. ఏఈ దామోదర్‌కు వినతిపత్రం అందించారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు కుక్క గంగాప్రసాద్, దారంగుల కుమార్, మదికుంట శంకర్, నిమ్మరాజుల రవి, పున్నం శశికుమార్, బొనగిరి కుమార్, జరుపుల శ్రీను, చిక్కుడు శేఖర్, రాజశేఖర్, వసంత, లీలా, రమ, లక్ష్మి, సుశీల, మోహన్, మారుతి, పాల్గొన్నారు.

సీఆర్‌పీ కుటుంబానికి ఆర్థికసాయం


ఫిక్స్‌డ్ బాండ్ అందిస్తున్న ఉపాధ్యాయులు

రామగుండం: జెడ్పీహెచ్‌ఎస్ పాఠశాలలో సీఆర్‌పీగా పనిచేసిన మెండె ప్రభాకర్ సంస్మరణ సభ శుక్రవారం పాఠశాల ఆవరణలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులు సేకరించిన రూ.51,200 విరాళాలను, మృతుడి కుమారుడి పేరున ఫిక్స్‌డ్ డిపాజిట్ చేసి మృతుడి భార్య, కుమారుడికి హెచ్‌ఎం స్వర్ణ అందించారు. ప్రభాకర్ సేవలను కొనియాడారు. కార్యక్రమంలో స్కూల్‌కాంప్లెక్స్ అసిస్టెంట్ సెక్రటరీ రాంపల్లి శ్రీనివాస్, హెచ్‌ఎం అరుణ, వి.రాజేశం, పెరటి రవీందర్, కుంట రామన్న, జి.పద్మ, సునీత, లక్ష్మణ్, నాగమణి పాల్గొన్నారు.

హైదరాబాద్‌కు నాన్‌స్టాప్ బస్సులు పెంచండి


డిపో మేనేజర్‌కు వినతిపత్రం ఇస్తున్న మధు

గోదావరిఖనిటౌన్: హైదరాబాద్‌కు వెళ్లే ప్రయాణికుల సౌకర్యార్థం నాన్‌స్టాప్ బస్సులు పెంచాలని ఆమ్ ఆద్మీ పార్టీ పార్లమెంట్ కన్వీనర్ మాలెం మధు కోరారు. ఈ సందర్భంగా గోదావరిఖనిలోని బస్‌డిపో మేనేజర్‌ను కలిసి సమస్యలపై శుక్రవారం వినతిపత్రం అందించారు. కరీంనగర్, పెద్దపల్లి, మంచిర్యాల, భూపాలపల్లి జిల్లాల నుంచి హైదరాబాద్‌కు వెళ్లే బస్సులు సిద్దిపేటలో ఆగకుండా నాన్‌స్టాప్ బస్సులు అధికం చేయాలన్నారు. దాదాపు 10 కిలోమీటర్ల దూరం పెరగడంతో పాటు చార్జీలు ఎక్కువ అవుతున్నాయన్నారు. హైవేపై మినీ బస్‌షెల్టర్ ఏర్పాటు చేయాలన్నారు. బస్సు వచ్చే ముందు అనౌన్స్ చేయడంతో పాటు స్కానింగ్, ఏటీఎం సేవలు అందుబాటులోకి తేవాలన్నారు. ఫ్రీ వైఫై జోన్‌లు ఏర్పాటు చేయాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో బాలు, రిషి, మల్లికార్జున్ తదితరులు ఉన్నారు.

ఎస్‌డీఎల్‌సీఈ కేంద్రాన్ని కొనసాగించాలి


వినతిపత్రం ఇస్తున్న సతీశ్

గోదావరిఖనిటౌన్: కరీంనగర్ జిల్లా ఎస్‌డీఎల్‌సీ కేంద్రాన్ని యథావిధిగా కొనసాగించాలని ఆల్‌ఇండియా అంబేడ్కర్ యువజన సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు కాంపెల్లి సతీశ్ కోరారు. ఈ సందర్భంగా రిజిస్టర్ డైరెక్టర్ శ్రీనివాసరావుకు వినతి పత్రం అందించారు. గోదావరిఖని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో కాకతీయ అనుబంధ దూర విద్య అధ్యయన కేంద్రం ఎస్‌డీఎల్‌సీఈని తరలించకుండా యథావిధిగా కొనసాగించాలని కోరారు.

రోడ్డు పనులకు ఎస్‌ఎఫ్‌సీ నిధులివ్వండి


వినతిపత్రం ఇస్తున్న ఎంపీటీసీ వసంత

పెద్దపల్లిరూరల్: మండలంలోని పెద్దబొంకూర్ పంచాయతీ పరిధిలోని శివారు గ్రామమైన దస్తగిరిపల్లి ఆంజనేయస్వామి ఆలయం వద్ద రోడ్డునుంచి 10 ఎల్ కాలువమీదుగా మొండయ్య ఇంటివరకు సీసీ రోడ్డు నిర్మించాలని ఎంపీటీసీ సభ్యురాలు మిట్లపల్లి వసంత కోరారు. శుక్రవారం ఎంపీడీవో కార్యాలయంలో వినతిపత్రం అందించారు. ఎస్‌ఎఫ్‌సీ గ్రాంటు నుంచి మంజూరైన రూ.5లక్షలతో పనులు చేపట్టి ప్రజల ఇబ్బందులు తొలగించాలని కోరారు.

అభివృద్ధి పనులకు ఎమ్మెల్యే శంకుస్థాపన


అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే

ఫెర్టిలైజర్‌సిటీ: రామగుండం కార్పొరేషన్ 39వ డివిజన్ ఖాజీపల్లిలో రూ.20 లక్షలతో నిర్మిస్తున్న సీసీ రోడ్డు, అండర్ గ్రౌండ్ డ్రెయినేజీ పనులను శుక్రవారం ఎమ్మెల్యే కోరుకంటి చందర్ ప్రారంభించి మాట్లాడారు. రామగుండం నియోజకవర్గంలో రూ.కోట్లల్లో నిధులు వెచ్చించి అభివృద్ధి పనులు చేశామన్నారు. త్వరలోనే డివిజన్‌కు మిషన్ భగీరథ నీరందించేలా చర్యలు చేపడతామన్నారు. రామగుండం మేయర్ బి.అనిల్‌కుమార్, మున్సిపల్ కమిషనర్ సుమన్‌రావు, 39వ డివిజన్ కార్పొరేటర్ జెట్టి జ్యోతి, బీఆర్‌ఎస్ నాయకులు పాల్గొన్నారు.

నేషనల్ అవార్డుకు సతీశ్ ఎంపిక

యైటింక్లైన్‌కాలనీ: బహుజన సాహిత్య అకాడమీ బెస్ట్ యోగా టీచర్ నేషనల్ 2023 అవార్డుకు యోగాగురువు సతీశ్ ఎంపికయ్యారు. శుక్రవారం అవార్డు పత్రాన్ని హైదరాబాద్‌లోని బహుజన సాహిత్య అకాడమీ జాతీయ కార్యాలయంలో అందించారు.

సాక్షి
పాఠక మహాశయులకు విజ్ఞప్తి
మీకు సాక్షి దినపత్రిక అందడంలో ఏమైనా ఇబ్బందులున్నా, లేక సాక్షికి బదులుగా ఇతర దిన పత్రికలు వేస్తున్న యెడల ఈ ఫోన్ నంబర్లకు ఉదయం 7.00 గం॥ల నుండి రాత్రి 8.00 గం॥ల లోపు తెలుపగలరు. వెంటనే తగు చర్యలు తీసుకోబడును.
మంథని : రాజేశ్ - 9676603963
పెద్దపల్లి : సరేశ్ - 8639544665
రామగుండం : సర్వర్ - 6281694028
టోల్ ఫ్రీ నెం. : 1800 425 9899

సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
పెద్దపల్లి జిల్లా :
9951602934
Office mail : knrjagati@gmail.com